మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
గురువారం , 22, అక్టోబర్ , 2026
తెలుగు డైలీ
ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## నవంబర్ 1న హస్తినలో

# ఏఐసీసీ మహా గర్జన

● హైదరాబాద్ సభ రద్దు వెనుక రాజకీయం ఇదేనా??

●హైదరాబాద్ సభను ఎందుకు వాయిదా వేసుకున్నట్లు?

●సొంత పార్టీ గెలుపుపై అపనమ్మకం వ్యక్తమయినట్లేనా?



హైదరాబాద్ :ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మహా గర్జన భారీ బహిరంగ సభ వేదిక ఆకస్మికంగా హైదరాబాద్ నుంచి నవంబర్ 1న ఢిల్లీలోని చారిత్రాత్మక రామ్‌లీలా మైదానానికి మారింది. తొలత ఈ జాతీయ స్థాయి శక్తి ప్రదర్శనను తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా నిర్వహించాలని భావించినప్పటికీ, అనూహ్యంగా వ్యూహాన్ని మార్చుకుని జాతీయ రాజధాని వైపు కాంగ్రెస్ అగ్రనాయకత్వం అడుగులు వేసింది. దీంతో తెలంగాణలోని గ్రామస్థాయి సర్పంచ్‌ల నుంచి శాసనసభ్యులు, ఎంపీలు , మంత్రుల దాకా అధికార యంత్రాంగం, పార్టీ కేడర్ అంతా హస్తిన బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ భారీ తరలింపు బాధ్యతను ఏఐసీసీ నేరుగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ భుజస్కంధాలపై మోపడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముందుగా అనుకున్నట్లుగా హైదరాబాద్‌లో ఈ సభను నిర్వహించకుండా చివరి నిమిషంలో వెనక్కి తగ్గడం వెనుక బలమైన రాజకీయ, ఆత్మరక్షణ కారణాలు ఉన్నాయనే ప్రచారం జోరందుకుంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీతో అధికారంలో ఉన్న తరుణంలో.. స్వయంగా తమ సొంత పాలన సాగుతున్న రాజధానిలోనే జాతీయ స్థాయి నిరసన లేదా ఆందోళన సభను నిర్వహిస్తే, అది విపక్షాలకు బలమైన రాజకీయ అస్త్రంగా మారే ప్రమాదం ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. "అధికారంలో ఉండి కూడా హైదరాబాద్‌లో సభ పెడుతున్నారంటే మీ ప్రభుత్వ గెలుపుపై మీకే నమ్మకం లేదా?" అని బీఆర్ఎస్, బీజేపీలు ప్రశ్నించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ అధిష్టానం ఈ వెనకడుగు వేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్న సమయంలో క్షేత్రస్థాయిలో రైతుల ఎల్ నినో నష్టపరిహారం, పవర్ ట్రూ-అప్ ఛార్జీల వడ్డన , మూసీ ప్రక్షాళన వంటి అంశాలపై ప్రజల నుంచి వ్యక్తమవుతున్న అసంతృప్తి కూడా ఈ నిర్ణయంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. హైదరాబాద్‌లో సభ పెడితే జనసమీకరణలో ఏమాత్రం లోటుపాట్లు జరిగినా, లేదా ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత ఉందని విపక్షాలు ట్రోల్ చేసినా అది పీసీసీ విజయంపైనే పెను సందేహాలను రేకెత్తిస్తుంది. అందుకే, అధికారంలో ఉన్న సొంత గడ్డపై ఎలాంటి రిస్క్ తీసుకోకుండా సభను నేరుగా కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు ఢిల్లీకి తరలించడమే సురక్షితమైన మార్గమని భావించారు. ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో జరగనున్న ఈ మహా గర్జన కు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను సైతం సమీకరిస్తుండటంతో, దీని ప్రాధాన్యత జాతీయ స్థాయికి చేరింది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలు, దర్యాప్తు సంస్థల దుర్వినియోగం , నిరుద్యోగం వంటి అంశాలపై ఏఐసీసీ సమరశంఖం పూరిస్తోంది. కేడర్‌ను హస్తినకు తరలించే బాధ్యతను పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రం నుంచి ప్రతి నియోజకవర్గం నుంచి ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేసి పదివేల మందికి పైగా ద్వితీయ శ్రేణి నేతలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లను ఢిల్లీకి తరలించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశారు.

### ఇన్‌స్టాగ్రామ్‌లోకి

# సోనియా గాంధీ

## - తొలి పోస్ట్‌తో ఆత్మకథ ఫస్ట్ లుక్ రిలీజ్






న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ప్రముఖ సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్‌లో అధికారికంగా అడుగు పెట్టారు. వచ్చే నెల విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఫస్ట్‌లుక్‌ను సోనియా గాంధీ తొలి పోస్టుగా పెట్టారు. పుస్తకం తొలి ప్రతులను అందుకుంటున్న దృశ్యాలతో కూడిన వీడియోను ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్నారు. ప్రేమ, విధి నిర్వహణ, నష్టాలు, తనకు తగిన స్థానాన్ని కనుగొనే అన్వేషణ వంటి అంశాలు ఇందులో ఉంటాయని వివరించారు. పుస్తకం తొలి ప్రతులను అందుకున్న సందర్భంగా కుమార్తె ప్రియాంక గాంధీ వాద్రాతో కలిసి స్వీట్లు పంచుకున్న దృశ్యాలు వీడియోలో కనిపించాయి. తన జీవితంలోని వ్యక్తిగత అనుభవాలను పాఠకులతో పంచుకునేందుకు ఎదురుచూస్తున్నట్లు సోనియా తెలిపారు.సోనియా గాంధీ ఆత్మకథ భారత ప్రచురణ హక్కులను హార్పర్‌కాలిన్స్ ఇండియా దక్కించుకుంది. నవంబర్ 10న దేశీయ మార్కెట్‌లో ఈ పుస్తకాన్ని విడుదల చేయనున్నట్లు గత నెలలో ప్రకటించింది. ఈ పుస్తకం ప్రచురణ వ్యవహారం గతంలో వివాదానికి దారితీసింది. తొలుత ఆత్మకథను ప్రచురించేందుకు ముందుకొచ్చిన పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా, చివరకు ఆ బాధ్యత నుంచి తప్పుకుంది. సంపాదకీయ మార్పుల విషయంలో ప్రచురణ సంస్థకు, రచయిత ప్రతినిధులకు మధ్య విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి.

### కులమతాలకు అతీతంగా కలిపే వేదిక..

# అలాయ్ బలాయ్



హైదరాబాద్, అక్టోబర్ 22:

కులమతాలు, రాజకీయాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకొచ్చే కార్యక్రమమే అలాయ్ బలాయ్ అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వ్యక్తుల మధ్య ఎన్ని భిన్నాభిప్రాయాలు, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి ఆత్మీయంగా కలుసుకోవాలని, ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకోవాలని పిలుపునిచ్చారు. స్నేహభావం, ఐక్యతను పెంపొందించడమే అలాయ్ బలా య్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విజయదశమి చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ఈ పండుగ స్ఫూర్తితో సమాజంలో సోదరభావం, సామరస్యం మరింత బలపడాలని ఆకాంక్షించారు. వ్యక్తిగత అభిప్రాయాలు, రాజకీయ విభేదాలు ఏవైనా.. పండుగల వేళ అందరూ కలిసి ఆనందాన్ని పంచుకోవాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందిస్తుందని వివరించారు.

# తెలంగాణ రక్షణ సేన తొలి శంఖారావం

## - ఎమ్మెల్సీ బరిలో కవిత పార్టీ.




హైదరాబాద్ :తెలంగాణ రాజకీయ యవనికపై కొత్తగా ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేన ప్రత్యక్ష ఎన్నికల ప్రస్థానానికి అత్యంత వ్యూహాత్మకంగా శ్రీకారం చుట్టింది. ఉమ్మడి వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ అభ్యర్థిగా తెలంగాణ ఉద్యమకారుడు, కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ గ్రహీత డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత అధికారికంగా ఖరారు చేశారు. దసరా పర్వదినం శుభ ముహూర్తాన్ని పురస్కరించుకుని తమ పార్టీ తరపున ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగుతున్న తొలి అభ్యర్థిని ప్రకటించడం ద్వారా కవిత తన రాజకీయ ముద్రను స్పష్టంగా చాటుకున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీలు ఇంకా సమీక్షలు, ఓటర్ల నమోదు కసరత్తుల్లోనే నిమగ్నమై ఉండగా.. అందరికంటే ముందే బహుజన సామాజికవర్గానికి చెందిన విద్యావంతుడిని బరిలో నిలిపి కవిత రాజకీయంలో తీవ్రమైన వేగాన్ని, దూకుడును ప్రదర్శిస్తున్నారు.గులాబీ పార్టీ తో తన రాజకీయ బంధం తెగిపోయిన తర్వాత ఆవిర్భవించిన తెలంగాణ రక్షణ సేనను కేవలం ఒక ప్రాంతీయ వేదికగా కాకుండా, క్షేత్రస్థాయిలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టేందుకు కవిత అత్యంత ప్రతిష్టాత్మకంగా వ్యవహరిస్తున్నారు. బిఆర్ఎస్ ప్రస్తుతం ఎదుర్కొంటుంది కేవలం నాయకత్వ లేమి మాత్రమే కాదని, క్షేత్రస్థాయి పోరాట పటిమ లోపించిందనే భావన ప్రజల్లో ఉందనేది పొలిటికల్ సర్కిళ్ల టాక్. సరిగ్గా ఈ అవకాశాన్ని పసిగట్టిన కవిత.. బిఆర్ఎస్ వదిలేసిన తెలంగాణ ఆత్మగౌరవం , బహుజన నాయకత్వం, ఉద్యమకారుల సంక్షేమం అనే ప్రధాన అజెండాలను తన భుజస్కంధాలపైకి ఎత్తుకున్నారు. బిఆర్ఎస్ కంటే మరింత దూకుడుగా రేవంత్ రెడ్డి సర్కార్‌ను ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యలపై ప్రెస్ మీట్లు, క్షేత్రస్థాయి పర్యటనలతో మీడియా అటెన్షన్‌ను సునాయాసంగా రాబట్టుకుంటున్నారు.

# తెలంగాణలో దసరా ధూమ్ ధామ్..

## నాలుగు రోజుల్లో రూ.755 కోట్ల మద్యం విక్రయాలు



హైదరాబాద్ :దసరా పండుగ తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టింది. ఈసారి మద్యం అమ్మకాలు గత రికార్డులన్నింటినీ బద్దలు కొట్టాయి. పండుగకు ముందు కేవలం నాలుగు పనిదినాల్లోనే రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా రూ. 755.14 కోట్ల విలువైన మద్యం అమ్ముడై, సరికొత్త రికార్డు సృష్టించింది. గతేడాది ఇదే సమయంలో నమోదైన రూ.698 కోట్ల విక్రయాలను ఈసారి అమ్మకాలు అధిగమించాయి.పండుగ సీజన్‌లో మద్యం అమ్మకాలు పెరగడం సాధారణమే అయినా, ఈసారి విక్రయాలు అంచనాలను మించిపోయాయి. ముఖ్యంగా పండుగకు ముందురోజైన అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోవడం గమనార్హం. దసరా ముందు విక్రయాలను పరిశీలిస్తే, అక్టోబర్ 14న రూ.102.17 కోట్లు, 16న రూ.126.32 కోట్లు, 17న రూ.223.25 కోట్ల మద్యం అమ్ముడైంది. 15, 18 తేదీల్లో డిపోలకు సెలవు కావడంతో ఆ రెండు రోజులు మినహాయించి ఈ గణాంకాలు నమోదయ్యాయి.విక్రయాల సరళిని చూస్తే ఎప్పటిలాగే బీర్ల హవా కొనసాగింది. ఈ నాలుగు రోజుల్లో మొత్తం 10.44 లక్షల కేసుల బీర్లు అమ్ముడవగా, 6.83 లక్షల కేసుల హార్డ్ లిక్కర్ విక్రయాలు జరిగాయి. ఈ అమ్మకాలతో అక్టోబర్ 19 నాటికే ఈ నెలలో మొత్తం మద్యం విక్రయాల విలువ రూ.2,055 కోట్లకు చేరుకుంది. దసరా సీజన్ కావడంతో నెల చివరి నాటికి విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# హైదరాబాద్‌కు తిరుగుముఖం పట్టిన జనం

## - నగరంలో ఫుల్ ట్రాఫిక్ జామ్?



హైదరాబాద్ :దసరా పండుగ ముగించుకొని సొంతూళ్ల నుంచి హైదరాబాద్‌వస్తున్నప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఒకవైపు పండుగ సెలవుల తర్వాత జిల్లాల నుంచి లక్షలాది మంది ప్రజలు నగరానికి తిరిగి వస్తుండటం, మరోవైపు నగరంలో దుర్గామాత విగ్రహాల నిమజ్జన వేడుకలు జరుగుతుండటంతో హైదరాబాద్ వ్యాప్తంగాభారీగాట్రాఫిక్‌జామ్‌ఏర్పడింది.ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాలకు విగ్రహాలు భారీగా తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. దీంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ట్రాఫిక్?లో తీవ్ర అవస్థలు పడుతున్నారు.ఉదయం 4 గంటల నుంచి 7 గంటల వరకు హైదరాబాద్‌లోని కీలక రహదారులన్నీ వాహనాలతో నిండిపోయాయి. ముఖ్యంగా ఎల్బీనగర్? నుంచి దిల్?సుఖ్?నగర్ వెళ్లే మార్గంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.దీన్నినియంత్రించేందుకు విజయవాడ, నల్గొండ, ఖమ్మం జిల్లాల నుంచి వస్తున్న ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులకు ఎంజీబీఎస్ వైపు వెళ్లొద్దని పోలీసులు సూచిస్తున్నారు.ఎత్తివేసినట్లు పోలీసులు తెలిపారు.

## కేసీఆర్, రేవంత్ ఒకరినొకరు

# కాపాడుకుంటున్నారు



నిజామాబాద్: తెలంగాణలో రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లుగా మారిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఆరోపించారు. రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ప్రకటించిన తర్వాతే క్రాప్ హాలిడే గురించి నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నిజామాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఎంపీ ధర్మపురి అరవింద్ పలు విమర్శలు చేశారు. సాగునీటి ప్రాజెక్టుల డిజైన్ల మార్పుల వెనుక భారీ అవినీతి ఉందని ఆయన ఆరోపించారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి ఒకరినొకరు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భవిష్యత్తులో కలవడం ఖాయమని అరవింద్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్ రాజకీయ భవిష్యత్తుపైనా ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ గడ్డం పెంచుకున్నంత మాత్రాన ముఖ్యమంత్రి కాలేరని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి వ్యవహారంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉందని వ్యాఖ్యానించారు.ఈ సందర్భంగా 2029 ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను రాజకీయంగా గల్లంతు చేస్తామని ధర్మపురి అరవింద్ ధీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ సునామీ సృష్టిస్తుందని అన్నారు. ఏ పార్టీతోనూ పొత్తు ఉండదని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు.

# బీజేఆర్ నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ!






**జవహర్ నగర్, అక్టోబర్ 22 (ప్రజావాణి ప్రతినిధి)**
జవహర్ నగర్ బీజేఆర్ నగర్ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజానాయకుడు పండుగ సాయన్న జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ప్రముఖులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయన్న సేవలను స్మరించుకున్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు జింక నాగులు, బొబ్బిలి మంజుల యాదగిరి, బెజరమైన వెంకటయ్య; అధ్యక్షులు నారాయణ కనకయ్య; ఉపాధ్యక్షులు ముప్పిడి ఆంజనేయులు; కోశాధికారి పండుగ శేఖర్; జనరల్ సెక్రెటరీ ఏర్పుల పద్మారావు ఈ వేడుకల్లో ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. సమాజం కోసం, పేదల హక్కుల కోసం పండుగ సాయన్న చేసిన పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని వక్తలు కొనియాడారు. ముదిరాజ్ బిడ్డలంతా ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు గొడుగు పాండు, అల్లం వీరస్వామి, చీకోటి కన్నా, పెసర వెంకటేష్, గొడుగు బబులు, కొంతం రాజు, తేలు శ్రీనివాసు, పండుగ తిరుపతి పాల్గొని విజయవంతం చేశారు.

# ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలి.

**గోవిందరావుపేట మండల ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు.**

**పస్రా ఎస్సై తాజుద్దీన్.**

**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజావాణి)**




చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పర్వదినం
గోవిందరావుపేట మండల ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజల మధ్య ప్రేమాభిమానాలు, ఐకమత్యం మరింత బలపడాలని కోరుకుంటూ గోవిందరావుపేట మండల ప్రజలందరికీ హృదయపూర్వక విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తూ..మీ గోవిందరావుపేట మండలం ౹ాx తాజుద్దీన్.

# అమెరికాలో ఘనంగా ఝాన్సీ రెడ్డి మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం..







**జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, అక్టోబర్ 22(ప్రజావాణి):**
అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రం అపెక్స్‌లో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, విమెన్ ఎంపవర్‌మెంట్ తెలుగు అసోసియేషన్ (ఔజూూూ) వ్యవస్థాపకురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డిని ఆహ్వానిస్తూ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఝాన్సీ రెడ్డి తో ప్రవాస భారతీయులు ఆత్మీయంగా సమావేశమై పరస్పరం అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించారు. కార్యక్రమానికి కరుణాకర్ వంగూరు ఆతిథ్యం అందిస్తున్నారు. తెలుగు మహిళల సాధికారత కోసం ఔజూూూ ద్వారా కృషి చేస్తున్న ఝాన్సీ రెడ్డి తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆమె చేస్తున్న కృషి నేపథ్యంలో ఈ ఆత్మీయ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది.

# నారాయణఖేడ్ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు

**అలయ్ బలయ్ కార్యక్రమంలో**
**నారాయణఖేడ్ నియోజకవర్గం టీ ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి బాపు మల్ శెట్టి**




**ప్రజా వాణి న్యూస్ అక్టోబర్ 22 సంగారెడ్డి జిల్లా**
నారాయణఖేడ్ నియోజకవర్గంనారాయణఖేడ్ మునిసిపల్ పట్టణంలోని బాపు మల్ శెట్టి స్వగృహంలో అలాయ్- బలాయ్, కార్యక్రమం అత్యంత ఉత్సాహపూరిత, ఆత్మీయ వాతావరణం లో ఘనంగా జరిగింది, ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గం లో వివిధ గ్రామాల నుంచి టిఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు,వివిధ కుల సంఘాల నాయకులు, యువత, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా బాపు మల్ శెట్టి తో కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిసి ఒక్కరినొకరు ఆలింగనము చేసుకుంటూ అలాయ్- బలాయ్ , శుభాకాంక్షలు తెలుపుకున్నారుఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు వివిధ కుల సంఘ నాయకులు యువజన నాయకులు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# బచ్చన్నపేట మండలంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి





**జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, అక్టోబర్ 21(ప్రజావాణి):**
జనగామ నియోజకవర్గం బచ్చన్నపేట మండలంలో జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి గారు బుధవారం విస్తృతంగా పర్యటించారు. మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని ప్రజలతో మమేకమయ్యారు.

**బీఆర్ఎస్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే:**
బచ్చన్నపేట మండలం చిన్న రాంచర్ల గ్రామానికి చెందిన గ్రామ శాఖ అధ్యక్షుడు దాసరి కర్ణాకర్ రెడ్డి సోదరుడు దాసరి కమలాకర్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నేరుగా వారి నివాసానికి చేరుకున్నారు. కమలాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి, ఈ కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**బచ్చన్నపేటలో స్థానికులతో మాటామంతీ:**
అనంతరం బచ్చన్నపేట మండల కేంద్రంలో ఎమ్మెల్యే స్థానికులతో మాటామంతీ నిర్వహించారు. టీ తాగుతున్న సమయంలో పలువురు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎమ్మెల్యే ని కలిసి తమకు ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. వారి విజ్ఞప్తులను సావధానంగా విన్న ఎమ్మెల్యే గారు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు అందేలా చూస్తానని, అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

**దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజలు:**
బచ్చన్నపేట మండలం చిన్న రాంచర్ల గ్రామంలో మరియు బచ్చన్నపేట పట్టణంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవారి ఆలయాలను ఎమ్మెల్యే దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. "దుర్గామాత ఆశీస్సులతో జనగామ నియోజకవర్గ ప్రజలం దరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని తెలిపారు. ఈ పర్యటనలో మండల బీఆర్ఎస్ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రేబర్తి గ్రామంలో ఘనంగా దుర్గామాత అమ్మవారి నిమజ్జనం

**భక్తి శ్రద్ధలతో దుర్గమాత ఊరేగింపుతో నిమజ్జనం**



**మద్దూరు అక్టోబర్22, ప్రజా వాణి,** మండలంలోని రేబర్తి గ్రామంలో దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని,అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి ఉత్సాహాలతో నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు. యువత ఐకమత్యంతో, భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో సందడి వాతావరణాన్ని నెలకొల్పింది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని భక్తులు ప్రార్థించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన దుర్గ భవాని యూత్ అసోసియేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# జనగామ లో ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

**కొవ్వొత్తుల ర్యాలీ - అమరవీరులకు ఘన నివాళులు..**





**జనగామ జిల్లా ప్రతినిధి జె.ఉపేందర్, అక్టోబర్ 21(ప్రజావాణి):**
పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా బుధవారం జనగాం పట్టణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ ఘనంగా నిర్వహించారు. జనగాం డీసీపీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ ఆధ్వర్యంలో, జనగాం పోలీస్ స్టేషన్ నుండి ప్రధాన కూడళ్ల మీదుగా ఈ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. చేతిలో కొవ్వొత్తులు పట్టుకుని "అమరవీరులకు జోహార్" అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. ఈ ర్యాలీ అనంతరం విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీ రాజా మహేంద్ర నాయక్, ఐపీఎస్ మాట్లాడుతూ "పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది. శాంతి భద్రతల పరిరక్షణ కోసం, దేశ సమగ్రతను కాపాడటం కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అసువులు బాసిన అమరవీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత. వారి కుటుంబాలకు అండగా నిలబడాలి. వారి త్యాగాలు, సేవలు నేటి పోలీస్ తరానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది వారి స్ఫూర్తితో నిజాయితీగా, నిబద్ధతతో విధులు నిర్వహించాలి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం ఏసీపీ, సీఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీస్ సిబ్బంది, హోంగార్డులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# అంగడిపేట గ్రామంలో ఘనంగా విజయదశమి వేడుకలు

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోయపల్లి అనంత రాజు గౌడ్**



**నల్గొండ జిల్లా ప్రతినిధి ప్రజావాణి** చండూర్ మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామంలో మంగళవారం విజయదశమి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, "చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకే విజయదశమి. గ్రామాల్లో ఇలాంటి సంప్రదాయ వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంచుతాయి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బోయపల్లి అనంత రాజు గౌడ్, 4వ వార్డ్ కౌన్సిలర్ జెల్ల ధనమ్మ శ్రీను, 5వ వార్డ్ కౌన్సిలర్ కొండ్రెడ్డి మధు, చండూర్ పట్టణ బిఆర్ఎస్ కన్వీనర్ ఇరిగి రామన్న, నేలపట్ల యాదగిరి గౌడ్, పెద్దగోని బిక్షమయ్య గౌడ్, అయితగోని యాదయ్య గౌడ్, అనంత రమేష్ గౌడ్, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com